
సాక్షి
నాగర్‌కర్నూల్
మంగళవారం ၊ 31 ၊ జనవరి ၊ 2023



సేవలు మరింత చేరువ

వినూత్నమైన సేవలు, పథకాలతో ప్రజలకు మరింత చేరువవుతోంది తపాలా శాఖ.

వివరాలు 8లో ▸



నేటినుంచి బ్రహ్మోత్సవాలు

మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.5 /18.7

వాతావరణం

ఉదయం, రాత్రి సమయాల్లో చలి ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం పాక్షికంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

వైద్య కళాశాలలో కాంట్రాక్టు ఉద్యోగాల నియామకం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రిలో పనిచేసేందుకు ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 అనాటమీ, 3 ఫిజియాలజీ, 3 బయో కెమిస్ట్రీ, 3 ఫార్మకాలజీ, 2 ఫోరెన్సిక్ మెడికల్ పోస్టులు ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలన్నారు. ఫిబ్రవరి 6న ఉదయం 11 గంటలకు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయని, పూర్తి వివరాలకు gmcnagarkurnool.org వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

నవోదయ దరఖాస్తుల గడువు పెంపు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో చేరికకు నిర్వహించే ప్రవేశ పరీక్ష గడువు తేదీని వచ్చే నెల 8 వరకు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఉన్న సాంకేతిక కారణాలతో దరఖాస్తులు నమోదు కావడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావడంతోనే ఈ గడువు పెంచారన్నారు. దరఖాస్తు చేసుకోని వారు 8 వరకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతల నుంచి విరాళాలు అందిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం అచ్చంపేటలోని శ్రీవాణి ఆప్టికల్స్ యజమాని లింగారెడ్డి, రజిత దంపతులు నిత్యాన్నదానానికి రూ.25,116 అందించారు. ఆలయంలో పూజలు చేసిన దాత కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు నివేదిత, సాత్విక, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ అభినందన



కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి మున్సిపాలిటీని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ట్విటర్ ద్వారా అభినందించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు బాగా జరుగుతున్నాయని కితాబిచ్చారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ పార్కులు అందులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, పార్కులోని పచ్చదనం అంశాలు అద్భుతంగా ఉన్నాయని పార్కుల ఫొటోలను ట్వీట్ చేశారు. ఇదే స్ఫూర్తితో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ సత్యం తెలిపారు.

వేరుశనగ @రూ.8370

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్‌లో వేరుశనగకు గరిష్ఠంగా రూ.8,370, కనిష్ఠంగా రూ.5,589 ధరలు లభించాయి. మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,254, హంస రూ.1,860, ఆర్‌ఎన్‌ఆర్ రూ.1,200, కందులు రూ.6,959 ధర లభించాయి. దేవరకద్రలో ఆముదాల ధర క్వింటాల్‌కు రూ.6,549 లభించింది.

రేపటి వరకు గడువు



- జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల కసరత్తు
- దరఖాస్తులకు ఫిబ్రవరి 1 వరకు అవకాశం
- జిల్లాలో 1,302 మంది అర్హులు
- మార్చి 4 వరకు కొనసాగనున్న ప్రక్రియ

అచ్చంపేట: ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల గడువును ప్రభుత్వం మరో రెండురోజులు పొడిగించింది. ఈ మేరకు ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో ఇప్పటి వరకు దరఖాస్తు ప్రక్రియలో అయోమయం కొనసాగడం, గడువు ముగిసిపోతుండటంతో ఆందోళన చెందిన ఉపాధ్యాయులకు ఊరట కలిగినట్టయింది. బదిలీల ప్రక్రియలో ఏమైనా అభ్యంతరాలుంటే తమకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని డీఈఓ గోవిందరాజులు ఇప్పటికే స్పష్టం చేశారు. గతంలో జీఓ 317 ద్వారా బదిలీపై జిల్లాకు వచ్చిన స్థానిక సంస్థల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు సర్వీస్ జీరో ఉండడం, బదిలీకి అవకాశం లేకపోవడంతో వీరంతా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న బడుల్లోనే ఉండనున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన..

స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల నేపథ్యంలో ఎస్జీటీ, పీఎస్‌హెచ్‌ఎంల సర్టిఫికెట్ల పరిశీలన సబ్జెక్టుల వారీగా కొనసాగుతోంది. ఉపాధ్యాయుల సర్వీస్ బుక్, టెన్త్, డిగ్రీ, టీటీసీ, బీఈడీ, సదరం (దివ్యాంగుల), కుల ధ్రువపత్రాలను స్వీకరించారు. లోకల్ బాడీలో ఎస్జీటీ నుంచి ఎస్‌ఏకు సబ్జెక్టుల వారీగా అర్హత కలిగిన పీఎస్‌హెచ్‌ఎం, సాంఘికశాస్త్రం, గణితం, బయోసైన్స్, ఫిజిక్స్, ఆంగ్లం, సాంఘిక (ఉర్దూ), బయోసైన్స్ (ఉర్దూ) తదితర కేటగిరీల వారీగా అర్హులైన ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. వెరిఫికేషన్ తర్వాత సీనియారిటీ జాబితా సిద్ధం చేసి, ప్రభుత్వ షెడ్యూల్‌ను అనుసరించి కౌన్సిలింగ్‌కు ఒకరోజు ముందు ఈ జాబితా వెలువరించనున్నారు. ఇందులో సర్దుబాట్లు అవసరం ఉన్నట్లు తేలితే సదరు ఉపాధ్యాయులకు మరోసారి అప్పీలుకు అవకాశం కల్పిస్తారు.

జిల్లాలో వారికి స్థానచలనం

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మార్చి 4 వరకు కొనసాగనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. వివిధ పాఠశాలల్లో 566 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. ఒకే పాఠశాలలో కనీస సర్వీస్ పూర్తి చేసుకున్న మరో 736 మందికి సైతం బదిలీ అనివార్యం కానుంది. దీంతో జిల్లాలో దాదాపు 1,302 మంది ఉపాధ్యాయులు బదిలీకి అర్హులుగా ఉన్నారు. ఇందులో జీహెచ్‌ఎంలు 89, స్కూల్ అసిస్టెంట్లలో వివిధ సబ్జెక్టుల్లో 358, ఎస్జీటీలు 737, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు 80, ఉర్దూ మీడియంలో 38 వరకు ఖాళీలున్నాయి. సీనియారిటీ జాబితా తయారు చేసిన తర్వాత మొదట వివిధ విభాగాల్లో బదిలీలు పూర్తి చేయనున్నారు. మిగిలిన ఖాళీల్లో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేస్తారు. జిల్లా పరిశీలకులుగా నియమితులైన అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఉపాధ్యాయుల దరఖాస్తులు, వెరిఫికేషన్, తిరస్కరణ, అర్హుల జాబితా, అభ్యంతరాలు తదితర ఫైనల్ జాబితాకు సంబంధించిన ప్రక్రియ మార్చి వరకు కొనసాగనుందని అధికారులు చెబుతున్నారు.

బదిలీల ప్రక్రియ ఇలా..

మొత్తం మూడు కేటగిరీల్లో బదిలీల ప్రక్రియ కొనసాగనుంది. ఒకే పాఠశాలలో ఫిబ్రవరి 1 నాటికి కనీసం రెండేళ్లు పనిచేసిన వారు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ప్రస్తుతం ఒకేచోట ఎనిమిదేళ్లు పనిచేసిన టీచర్లు, ఐదేళ్లు నిండిన హెచ్‌ఎంలు బదిలీల జాబితాలోకి వస్తారు. కాగా స్కూల్‌లో రెండేళ్ల సర్వీస్ ఉన్నవారికి బదిలీ లేకున్నా ఆప్షన్లు కోరుకునే అవకాశం కల్పించారు. ఒకే పాఠశాలలో పనిచేస్తూ ఎనిమిదేళ్లు నిండి, మరో మూడేళ్లలో ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులు సైతం తమకు మరోచోటుకు వెళ్లడం ఇష్టం లేకపోతే అక్కడే పనిచేసేలా అవకాశం కల్పించారు. తాజాగా ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు అవకాశమివ్వగా.. ఆ తర్వాత కేటగిరీల వారీగా బదిలీలను ప్రారంభిస్తారు. మొదట పీజీ హెచ్‌ఎలను బదిలీ చేసి పదోన్నతులు కల్పిస్తారు. వారి స్థానంలో ఎస్‌ఏగా అర్హత పొందిన ఉపాధ్యాయులను భర్తీ చేసి, మిగిలిన ఖాళీలను ఎస్జీటీల పదోన్నతులతో భర్తీ చేయనున్నారు. ఇక ఎస్జీటీలు తదితర ఖాళీలను డీఎస్సీతో భర్తీ చేయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా చేపడుతాం..



జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా చేపడుతాం. ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా పూర్తి చేస్తాం. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ ప్రక్రియలో చిన్న పొరపాటుకు అవకాశం ఉండదు. దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు ఇచ్చింది. ఆ తర్వాత కేటగిరీల వారీగా బదిలీలు ప్రారంభమవుతాయి.

– గోవిందరాజులు, డీఈఓ

సీనియారిటీ ప్రాతిపదికన..

ఉపాధ్యాయుల బదిలీల్లో సీనియార్టీ కీలకంగా మారింది. ప్రస్తుతం వారు పనిచేస్తున్న పాఠశాలలో 17 శాతం హెచ్‌ఆర్‌ఏ పొందుతున్న వారికి ఏడాదికి ఒక పాయింట్, 13 శాతం పొందుతున్న వారికి ఏడాదికి రెండు పాయింట్లు, 11 శాతం పొందే వారికి ఏడాదికి మూడు పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. అన్ని క్యాడర్లలో పనిచేసిన మొత్తం సర్వీస్ పూర్తయిన వారికి ప్రతినెలా 0.41 పాయింట్లు, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘాల రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అదనంగా పది పాయింట్లు, అవివాహిత మహిళా ఉపాధ్యాయులకు, హెచ్‌ఎంలకు పది పాయింట్లు, స్పౌజ్ కేసులో 10 పాయింట్లు కేటాయించి వారు సాధించిన మొత్తం పాయింట్ల ఆధారంగా సీనియారిటీ జాబితా రూపొందిస్తారు. 70 శాతానికి తగ్గకుండా వైకల్యమున్న వారికి బదిలీల్లో మొదటి ప్రాధాన్యత, వితంతువులకు రెండో ప్రాధాన్యత, చట్ట ప్రకారం విడాకులు పొంది మళ్లీ వివాహం చేసుకోని వారికి మూడో ప్రాధాన్యత కల్పిస్తారు.

ఏసీబీ వలలో కోడేరు డీటీ

- విరాసత్ కోసం డబ్బులు డిమాండ్
- రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



పట్టుబడిన డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం



బాధిత రైతు సాయిబాబు

కోడేరు: ఓ రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటూ డిప్యూటీ తహసీల్దార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధిత రైతు, ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. కోడేరు మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన చీకిరాల వెంకయ్యకు రేకులపల్లి శివారులో సర్వే నం. 3/ఎలో 4 గుంటలు, 4/ఎలో 4 గుంటలు, 180/2 ఎలో 10 గుంటలు, 180/3/ఎలో 10 గుంటలు, 180/4ఈ/3లో 24 కుంటలు కలిపి మొత్తం 1.12 ఎకరాల భూమి ఉంది. నాలుగేళ్ల క్రితం వెంకయ్య మృతి చెందడంతో కుమారుడు సాయిబాబు విరాసత్ చేసుకోవడం కోసం ఆరు నెలల క్రితం మీసేవలో దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు ఫారాలను తహసీల్దార్ మల్లికార్జున్‌కు ఇవ్వగా ఆయన డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తంకు అప్పగించారు. అప్పటి నుంచి సాయిబాబ తమ పని కావడం లేదని బంధువు చీకిరాల నాగేంద్రంతో కలిసి డిప్యూటీ తహసీల్దార్‌కు విరాసత్ చేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ వినకపోవడంతో రెండు నెలల క్రితం నాగర్‌కర్నూల్‌లోని ప్రజావాణిలో అధికారులకు విన్నవించారు. జిల్లా అధికారులు విరాసత్ చేయమని డిప్యూటీ తహసీల్దార్‌కు చెప్పినా పని చేయకపోవడంతో 20రోజుల క్రితం డిప్యూటీ తహసీల్దార్ వారిని పిలిచి రూ.15వేలు ఇస్తే విరాసత్ చేస్తానని చెప్పారు. అన్ని డబ్బులు ఇవ్వలేమని రూ.8 వేలు ఇస్తామని చెప్పగా.. చివరికి రూ.10 వేలు ఇస్తేనే పనిచేస్తామని చెప్పడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఈ నెల 26న డబ్బులు తీసుకొని కార్యాలయానికి రాగా డిప్యూటీ తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్ చేయగా.. సోమవారం రావాలని చెప్పాడు. ఏసీబీ అధికారుల సూచన సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి రూ.10వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారి డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నాంపల్లి కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.



కోడేరు తహసీల్దార్ కార్యాలయం

మాకు సమాచారం ఇవ్వండి..

ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు. టోల్‌ఫ్రీ నం.1064తోపాటు సెల్ 94913 05609కు ఫోన్ చేయాలని సూచించారు. దాడుల్లో ఏసీబీ మహబూబ్‌నగర్ ఎస్‌ఐ లింగస్వామి, నల్లగొండ ఎస్‌ఐ వెంకట్రావ్, పది మంది సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన రూ.10 వేల నగదు

'ప్రజావాణి'కి 35 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్: ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో ఆయన ముందుగా మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా అధికారులతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ సర్వజనులహితం కోసం పోరాడారని కొనియాడారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలతో 35 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘానికి ఎకరా ప్రభుత్వ స్థలం కేటాయించాలని జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రావు, సభ్యులు ఖాజామైనొద్దీన్, తిరుపతయ్య వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఓ భూపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 4..

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ మనోహర్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు ప్రజావాణికి 4 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 2 భూ తగాదాలు, 1 ప్లాట్ విషయంలో చీటింగ్ చేశారని, 1 ఇరువర్గాల గొడవకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మనోహర్

అర్హులందరికీ పోడు పట్టాలు

కందనూలు: జిల్లాలో ఎఫ్‌ఆర్‌సీ గ్రామసభలు నిర్వహించి, జిల్లా కమిటీ పరిశీలనలో ఉన్నాయని తేలిన వారికి వచ్చేనెల 7లోగా పోడు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ మనూచౌదరి అన్నారు. సోమవారం రాష్ట్ర గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి సోమవారం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మనూచౌదరి మాట్లాడుతూ అర్హులైన ఎస్సీ, ఎస్టీ పోడు రైతులకు పట్టాలు ఇవ్వడమే కాకుండా నిబంధనల ప్రకారం అడవిని కాపాడుకుంటామన్నారు. కంటి వెలుగులో ఎలాంటి సమస్యలు లేకుండా సంబంధిత అధికారులకు సూచనలు చేస్తున్నట్లు వివరించారు. ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీల విషయంలో సీనియారిటీ జాబితా సిద్ధం చేసుకొని ముందుకు వెళ్తున్నామన్నారు. మెడికల్ సర్టిఫికెట్ విషయంలో ప్రత్యేక బోర్డు ద్వారా పరిశీలన కార్యక్రమం పూర్తి చేశామన్నారు. జిల్లాలో 2022–23 సంవత్సరంలో 3 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగుకు గాను ఇప్పటికే 531 మంది రైతులతో 2,204 ఎకరాల్లో తోటలు సాగు చేయించామని చెప్పారు. వీసీలో అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఎఫ్‌ఓ రోహిత్‌గోపిడీ, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, డీఈఓ గోవిందరాజులు, ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్, బీసీ సంక్షేమ అధికారి అనిల్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు మనూచౌదరి, మోతీలాల్

మహాత్మాగాంధీ స్ఫూర్తితో ఉద్యమిద్దాం

నాగర్‌కర్నూల్ రూరల్: దేశ స్వాతంత్య్రం కోసం జరిగిన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన మహాత్మగాంధీ పోరాటాలు, త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకుని మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. సోమవారం స్థానిక గాంధీ పార్కు వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో బీజేపీ తమ రాజకీయ లబ్ధికోసం మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజ్యాంగాన్ని, లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో దేశంలో బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా చేపట్టే పోరాటాలకు ప్రతిఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, నర్సింహ, విజయుడు, ఏసయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు, కృష్ణ, బాలమురళీకృష్ణ, లక్ష్మీపతి, శ్రీనివాసులు, నాగన్న, పరశురాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

బల్మూర్ తహసీల్దార్ కార్యాలయానికి విద్యుత్ కనెక్షన్ కట్

- నేడు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తిరిగి పునరుద్ధరణ

బల్మూర్: భూ రిజిస్ట్రేషన్లతో నిత్యం ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించే తహసీల్దార్ (సబ్‌రిజిస్ట్రార్) కార్యాలయానికి విద్యుత్ బకాయి డబ్బులు చెల్లించకపోవడంతో ఆ శాఖ అధికారులు కనెక్షన్ కట్ చేశారు. దీంతో కార్యాలయంలో నిత్యం జరిగే అన్నిరకాల పనులకు తీవ్ర అంతరాయం కలిగింది. మండల తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి రూ.72,206 విద్యుత్ బిల్లు బకాయి ఉంది. దీనిని చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం కరెంట్ కనెక్షన్ కట్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ కిష్ట్యానాయక్ విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మంగళవారం మధ్యాహ్నంలోగా బిల్లు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఎస్‌ఈ లీలావతి సూచన మేరకు సాయంత్రం 4 గంటల సమయంలో కార్యాలయానికి తిరిగి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. మండల స్థాయిలో ప్రధానమైన తహసీల్దార్ కార్యాలయానికి కరెంట్ కట్ చేయడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: అంగవైకల్యంతో ఇబ్బంది పడుతున్న దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, పింఛన్లపై ఆంక్షలు విధిస్తున్న జీఓ 15ను వెంటనే రద్దు చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి బాలీశ్వర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల కల్యాణ లక్ష్మి దరఖాస్తులను పరిశీలించాలని, స్వయం ఉపాధి రుణాలు అందజేయాలని, పింఛన్‌ను రూ.10 వేలకు పెంచాలని, డబుల్ బెడ్ రూం ఇళ్లలో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, నిరుద్యోగులకు రూ.5 లక్షల సబ్సిడీ రుణాలు అందజేయాలని, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దివ్యాంగ రుణాలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసులు, నాయకులు ఆంజనేయులు, స్వామి, మహేశ్, తిరుపతయ్య, శశిధర్‌శర్మ, ప్రభాకర్, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య ఫలాలు

అచ్చంపేట/ తాడూరు: సకలజనులకు ప్రజాస్వామ్య ఫలాలు అందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలన్నారు. సోమవారం భారత్ జోడ్ యాత్ర ముగింపు, హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభం సందర్భంగా శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరక్షేత్రంలో, తాడూరు మండలంలోని గుట్టలపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో మాజీ ఎంపీ మల్లురవి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణతో కలిసి నాగం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలతో ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసిందని విమర్శించారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రజలు సామాజిక తెలంగాణ ఉద్యమానికి సిద్ధం కావాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఉమామహేశ్వరుడిని కోరుకున్నామని చెప్పారు. తెలంగాణలో అరాచక పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు చివరి గడియలు దాపురించాయని, త్వరలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాడూరు మండలంలోని గుట్టలపల్లి, పాలుమూరు గ్రామాల్లో హాత్ సే హాత్ కార్యక్రమం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, వల్లభ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సుమిత్ర, రోహిణి, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మయ్య, కౌన్సిలర్లు గౌరీశంకర్, సురేందర్, కాశన్నయాదవ్, వెంకట్‌రెడ్డి, మల్లేష్, రామనాథం, మల్లికార్జున్, రాజ్‌గోపాల్, సర్పంచ్ జానకమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కరుణాకర్, పాండు, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



హాత్ సే హాత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


అనంతరాజు (ఫైల్)

తాడూరు: ఇంటికి కర్రలపై లాగిన విద్యుత్ వైర్లను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై రైతు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని తుమ్మలసూగూరులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనంతరాజు(35) తన ఇంటి దగ్గర విద్యుత్ స్తంభం దూరంగా ఉండడంతో కనెక్షన్ కోసం కర్రను ఏర్పాటు చేస్తున్నాడు. కర్రపై ఉన్న విద్యుత్ వైర్లు కిందపడడంతో సరిచేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహానికి జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరాజుకు భార్య లక్ష్మితోపాటు కొడుకు, కూతురు ఉన్నారు.

హైదరాబాద్‌లో లింగాలవాసి..


వెంకటేష్ (ఫైల్)

లింగాల: జీవనోపాధి కోసం భార్యాపిల్లలతో కలిసి వెళ్లిన లింగాలకు చెందిన రమావత్ వెంకటేష్(25) ఆదివారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కొంత కాలం నుంచి హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఒక్కగానొక్క కుమారుడు వెంకటేష్ మృతిచెందడంతో తల్లిదండ్రులు లచ్చి, సీతారాములు బోరున విలపించారు. వెంకటేష్‌కు భార్య కవిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

యువతి అదృశ్యం

గోపాల్‌పేట (రేవల్లి): ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రేవల్లి ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారం గ్రామానికి చెందిన నాగమ్మ, నిరంజన్‌ల కూతురు అనిత ఆదివారం వనపర్తి ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోతేపల్లిలో గొర్రెల చోరీ

వెల్దండ: మండలంలోని పోతేపల్లికి చెందిన బోయిని తిరుపతయ్య అనే రైతుకు చెందిన 21 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లినట్లు బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రోజుమాదిరిగానే వ్యవసాయ పొలంలోని షెడ్డులో గొర్రెలను ఉంచగా, గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తి స్థాయి నీటి మట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 280 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రసీల్‌రెడ్డి తెలిపారు.

ఇల్లు దగ్ధం: రూ.2 లక్షల ఆస్తినష్టం

ఎర్రవల్లిచౌరస్తా: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఇల్లు దగ్ధమైన సంఘటన ఇటిక్యాల మండలంలోని మొగిలిరావులచెర్వులో సోమవారం చోటుచేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ గోకారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆటో భాష కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం బంధువుల గ్రామానికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో ఫ్రిజ్, బియ్యం, దుస్తులు, కుట్టు మిషన్, బీరువ, మంచం, టీవీ తదితర వస్తువులు కాలిపోయి రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



సేవలు మరింత చేరువ..

- తపాలా శాఖలో కొత్త పథకాల అమలు
- పోస్టల్ పథకాలకు పెరిగిన వడ్డీరేట్లు
- ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా సేవలు



స్టేషన్ మహబూబ్‌నగర్: వినూత్నమైన సేవలు, పథకాలతో ప్రజలకు మరింత చేరవుతోంది తపాలా శాఖ. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకొని ఖాతాదారులకు, మెరుగైన సేవలు అందిస్తూ మరింత చేరువవుతోంది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి ఎస్‌బీ ఖాతాదారుడు (18–70 ఏళ్లు) ఏడాదికి ప్రీమియం రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. అదే విధంగా ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన (పీఎంజేజేబీవై)లో ప్రతి ఎస్‌బీ ఖాతాదారుడు (18–50 ఏళ్లు) ఏడాదికి రూ.436లు చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. తపాలాశాఖలో మరో పథకం అటల్ పెన్షన్ యోజన (ఏపీవై). ఈ పథకంలో 18–40 ఏళ్ల వారు 60 ఏళ్ల తర్వాత వారు కోరుకున్న విధంగా నెలకు రూ.1000 నుంచి రూ.5వేల వరకు ప్రభుత్వం నుంచి పెన్షన్ రూపేణా పొందవచ్చు. వారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది.

బాలికల భవితకు భరోసా సుకన్య సమృద్ధి..

తపాలా శాఖలో మరో ప్రధానమైనది సుకన్య సమృద్ధి పథకం. పదేళ్లలోపు అమ్మాయి పేరున నేచురల్ గార్డియన్ లేదా లీగల్ గార్డియన్ సుకన్య సమృద్ధి ఖాతాను ఏ పోస్టాఫీస్‌లోనైనా తెరవచ్చు. ఒక ఖాతాను కనీసం రూ.250తో ప్రారంభించి ఆర్థిక సంవత్సరంలో రూ.లక్షా 50వేలు జమచేయవచ్చు. ప్రస్తుతం 7.6శాతం చక్రవడ్డీగా నిర్ణయించడం జరిగింది. ఖాతా తెరిచిన నాటి నుంచి 15ఏళ్లు పూర్తయ్యే వరకు డబ్బులు జమచేయాలి. ఖాతా తెరిచిన తేదీ నుంచి 21 ఏళ్ల తర్వాత ఖాతా నిలిపివేస్తారు. అప్పటివరకు జమచేయబడిన డబ్బుకు చక్రవడ్డీని కలిపి అమ్మాయికి అందజేస్తారు. అమ్మాయి వయస్సు 18 నిండిన తర్వాత ఆమె వివాహం లేదా చదువు కోసం అంతకుముందు ఆర్థిక సంవత్సరం వరకు జమ అయిన మొత్తంలో 50 శాతం డబ్బు తీసుకోవచ్చు.

ఐపీపీబీతో బ్యాంక్ సేవలు...

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా తపాలాశాఖ ప్రజలకు బ్యాంక్ సేవలు అందిస్తోంది. ఐపీపీబీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు బ్యాంక్ సేవలు పొందవచ్చు. ఆధార్, మొబైల్ ద్వారా రూ.250లతో ఐపీపీబీ ఖాతా తెరవచ్చు. ఆన్‌లైన్ సేవలు, వివిధ బిల్లులు చెల్లింపు చేసుకునే అవకాశం ఉంటుంది. రూ.299, రూ.399లతో రూ.10లక్షల బీమా సౌకర్యం లభిస్తుంది. అదే తపాలాశాఖలో తపాలా జీవితా బీమా (పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవితా బీమా (ఆర్‌పీఎల్ఐ) పాలసీలు అందుబాటులో ఉన్నాయి.

పోస్టల్ పథకం	వడ్డీరేటు	
	పాత	కొత్త
పోస్టాఫీస్ సేవింగ్ అకౌంట్స్	4.0	4.0
ఒక సంవత్సరం డిపాజిట్	5.5	6.6
రెండు సంవత్సరాల డిపాజిట్	5.7	6.8
మూడు సంవత్సరాల డిపాజిట్	5.7	6.9
ఐదు సంవత్సరాల డిపాజిట్	6.7	7.0
ఐదు సంవత్సరాల రికరింగ్ డిపాజిట్	5.8	5.8
సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం	7.6	8.0
మంత్లీ ఇన్‌కం అకౌంట్ స్కీం	6.7	7.1
సుకన్య సమృద్ధి అకౌంట్	7.6	7.6
పబ్లింగ్ ప్రావిడంట్ ఫండ్ స్కీం	7.1	7.1
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	6.8	7.0
కిసాన్ వికాస్ పత్ర	7.0	7.2

సద్వినియోగం చేసుకోవాలి..



తపాలా శాఖ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోంది. ప్రజల సౌకర్యార్థం పలు పథకాలకు వడ్డీరేట్లు పెంచింది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. శనివారం నుంచి ఈనెల 31 వరకు తపాలా శాఖ అకౌంట్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇంటింటికీ తిరి గి తపాలాశాఖ సేవలపై ప్రజల కు అవగాహన కల్పించడం, ఆసక్తిగల ఉన్న వారికి ఖాతాలను తె రుస్తాం.

– విద్యాసాగర్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, మహబూబ్‌నగర్ ఈస్ట్ సబ్ డివిజన్


జిల్లా కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయం

పోస్టల్ పథకాలకు పెరిగిన వడ్డీరేట్లు..

తపాలా శాఖ ప్రజలకు మరింత ఆర్థిక చేయూత అందించేందుకు పలు పథకాలను వడ్డీరేట్లను పెంచింది. పెరిగిన వడ్డీరేట్లు ఈ ఏడాది మార్చి 31వరకు అమల్లో ఉంటుంది. పెరిగిన వడ్డీరేట్లపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ నెల 31వ తేదీ వరకు అన్ని బ్రాంచీలలో స్పెషల్ అకౌంట్స్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

- డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు
- గుడేబల్లూర్‌లో 38 ద్విచక్రవాహనాల సీజ్

కృష్ణా: శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని గుడేబల్లూరులో మక్తల్ సీఐ సీతయ్య, మరికల్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ ఎస్‌ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో మొత్తం 80 మంది పోలీసులతో 300 ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంట్లో ఎవరెవరు ఉంటున్నారు.. కొత్తగా ఎవరైనా వచ్చారా.. ఇంట్లోని వారు ఏ పనులు చేస్తున్నారనే వివరాలను తెలుసుకున్నారు. అలాగే వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 38 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ద్విచక్రవాహనాలకు సరైన పత్రాలను చూయించి తీసుకెళ్లాలని చెప్పారు. పాఠశాలలను పరిశీలించి విద్యార్థులు ప్రతినిత్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఇంట్లో తల్లిదండ్రులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. గ్రామంలోకి కొత్తగా ఎవరైనా అనుమానాస్పదంగా వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ క్రైం: కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల అన్ని రకాలుగా ఉపయోగాలు ఉన్నాయని టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోనప్పగుట్ట ఏరియాలో సోమవారం సాయంత్రం కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంలో తనిఖీలు చేపట్టారు. కాలనీలోని 40 ఇళ్లను సందర్శించి ఇంట్లో ఉన్న వారి వివరాలు సేకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయాల్లో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్త వ్యక్తులు కాలనీల్లో అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సెకండ్ హ్యాండ్‌లో ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసే క్రమంలో సరైన పత్రాలు లేకుంటే కొనుగోలు చేయరాదన్నారు. వాహనదారులు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.


వివరాలు సేకరిస్తున్న పోలీస్ సిబ్బంది

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి


మాట్లాడుతున్న జడ్జి సంధ్యారాణి

మహబూబ్‌నగర్ క్రైం: చట్టాలపై అవగాహన లేకుండా చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఖైదీల పరివర్తనలో మార్పు చాలా అవసరమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ, జిల్లా పోలీస్ షీటీం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జైలులో ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రెండు నెలలకోసారి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జైలును సందర్శించడం జరుగుతుందన్నారు. జైలులో ఖైదీల సమస్యలు, వారి పరివర్తనలో మార్పులు, న్యాయవాదుల నియామకం, బెయిల్ కోసం తీసుకోవడం వంటివాటిపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉమెన్ పీఎస్ సీఐ హన్మప్ప మాట్లాడుతూ చిన్నపాటి సమస్యల వల్ల ఘర్షణలకు వెళ్తూ కుటుంబాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారని, దీని వల్ల నష్టాలు జరుగుతాయని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాల్లో తల్లిదండ్రులకు తమ పిల్లలపై సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్ల చెడు మార్గాల్లోకి వెళ్తున్నారని తెలిపారు. ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండి బయటకు వెళ్లిన తర్వాత ఉత్తమ జీవన విధానం సాగించాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం


టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజంలోని అట్టడుగుల వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. దేశ ఐక్యత కోసం రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర చేపట్టినట్లు తెలిపారు. విద్వేషాలకు వ్యతిరేకంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్‌గాంధీ పెద్దఎత్తున పాదయాత్ర చేపట్టారని, ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. పాదయాత్రలో మేధావులు, సామాజిక వేత్తలు మమేకమైనట్లు తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్ చేపట్టిన జోడోయాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దేశంలోని రాజకీయ నాయకులకు ఆయన ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. వచ్చే నెల 6 నుంచి చేపట్టనున్న హాత్‌సే హాత్ జోడోతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి తిరిగి ప్రజల్లోకి తీసుకెళుతామన్నారు. అంతకుముందు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర పూర్తయిన సందర్భంగా స్థానిక అబ్దుల్ ఖాదర్ దర్గాలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంజీవ్, ఎస్.వినోద్‌కుమార్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, జహీర్ అక్తర్, వసంత, సీజే బెనహర్, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

వేతనాల్లో కోతలు సరికాదు

వనపర్తి క్రైం: జిల్లాలోని రేవల్లి, ఖిల్లాఘనపురం, ఆత్మకూర్, పెబ్బేరు, వీపనగండ్ల ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల చెల్లింపులో భారీ కోతలకు పాల్పడుతున్న ఏజెన్సీని రద్దు చేయాలని మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ నాయకులు కలెక్టర్ యాస్మిన్ భాషాకు వినతిపత్రాన్ని అందజేశారు. నాలుగు పీహెచ్‌సీలను టెండర్లలో ఎంపికైన వెంటయ్య ఏజెన్సీ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న కార్మికులకు రూ.15,600 వేతనాల్లో పీఎఫ్, ఈఎస్‌ఐ పోను రూ.12,093 కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికి కేవలం రూ.7 నుంచి 8వేలు మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. తక్కువ వేతనాలపై కార్మికులు నిర్వాహకులను అడిగితే వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో బాలరాజు, అరున్, పార్వతమ్మ, చిన్ననాగన్న, తిరుపతమ్మ, పద్మమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు


చిరుత దాడిలో ఆవుదూడ మృతి

నవాబుపేట: మండలంలోని రుక్కంపల్లిలో చెన్నయ్య అనే రైతుకు చెందిన ఆవుదూడను చిరుత దాడి చేసి హతమార్చింది. ఆదివారం రాత్రి పొలం వద్ద ఆవుదూడను కట్టేసి వచ్చారు. సోమవారం ఉదయం వెళ్లగా మృతి చెందిన ఆవుదూడ కనిపించింది. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి చిరుత దాడిచేసినట్లుగా నిర్ధారించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, పశువులను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచించారు.

గట్టుపల్లిలో హైనా దాడి..

ఉప్పునుంతల: మండలంలోని గట్టుపల్లి సమీపంలో ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన తాడూరు వెంకటయ్య పొలంలో ఆవు దూడపై అడవి జంతువులు దాడిచేసి చంపాయి. పొలంలో కట్టేసి ఉంచిన పశువుల వద్ద ఉన్న ఆవు దూడపై దాడిచేసి చంపడంతో రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్టు బీట్ ఆఫీసర్ చంద్రమౌళి, అటవీశాఖ బయాలజిస్టు రవికాంత్ వచ్చి పరిశీలించి హైనా దాడిచేసి చంపినట్లు వారు నిర్ధారించారు.

నువ్వులు విత్తేందుకు అనువైన కాలం


నువ్వుల పంట రకాలు

పాడి-పంట

అధికారి సలహా: జాన్ సుధాకర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

నారాయణపేట: నువ్వుల పంటను విత్తేందుకు ఫిబ్రవరి మొదటి వారం అనువైన దినాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారు జాన్‌సుధాకర్ పేర్కొన్నారు. ఎగుమతికి తగ్గట్టుగా పంటను పండించినట్లయితే మంచి ఆదాయం ఆర్జించవచ్చన్నారు. ఫిబ్రవరిలో విత్తుకొని అతి తక్కువ సమయంలో తక్కువ వనరులతో అధిక నికర లాభాన్ని ఆర్జించేందుకు నువ్వుల పంట ఉపకరిస్తుందన్నారు. వేసవిలో ఆరుతడి పంటగా వేసినపుడు చీడపీడల బెడద తక్కువగా ఉండి, విత్తన నాణ్యత పెరిగి, అధిక దిగుబడి పొందేందుకు అవకాశాలు ఉన్నయని పేర్కొన్నారు.

నేలలు

మురుగు నీరు నిల్వలేని తేలికైన నేలల్లో నువ్వులు విత్తడం శ్రేష్టం. నీరు నిలిచే ఆమ్ల, క్షార గుణాలు కల నేలలు పనికిరావు.

నేల తయారీ

నేలను 2 నుంచి 4 సార్లు మెత్తగా దున్ని, రెండు సార్లు గుంటక తోలి చదును చేయాలి.

విత్తనం విత్తే పద్ధతి..

ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనానికి మూడింతల ఇసుక కలిపి గొర్రుతో వరుసల్లో విత్తుకోవాలి. వరుసల మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తుకోవాలి.

నువ్వుల రకాలు

శ్వేత: వేసవిలో అధిక దిగుబడినిచ్చే తెల్లరకం గింజ. కాండం కుళ్లును తట్టుకొని 85 నుంచి 90 రోజుల్లో 250 నుంచి 450 కిలోల వరకు ఎకరానికి దిగుబడినిస్తుంది.

హిమ (జే.సీయస్.9426): స్వల్పకాలిక తెల్లగింజ రకం. వెర్రి తెగులును తట్టుకుంటుంది. ఎగుమతి ప్రాధాన్యత ఉంటుంది. 80నుంచి 85రోజుల్లో 280 నుంచి 450కిలోల దిగుబడి ఎకరాకు వస్తుంది.

రాజేశ్వరి: తెల్లగింజ రకం, కాండం కుళ్లు, బూడిద తెగుళ్లను తట్టుకుంటుంది. 85 నుంచి 90 రోజుల్లో 200 నుంచి 300 కిలోలు ఎకరానికి దిగుబడినిస్తుంది.

చందన: గోధుమ రంగు విత్తనం అన్ని కాలాలకు అనుకూలం. వెర్రి తెగులును తట్టుకుంటుంది. 80 నుంచి 85 రోజుల్లో 250 నుంచి 480 కిలోల దిగుబడి ఎకరాకు ఇస్తుంది.

ఎలమంచిలి.66(శారద): లేత గోధుమ రంగు విత్తనం. ఆకుమచ్చ తెగులును తట్టుకుంటుంది. పంట కాలం 75 నుంచి 80 రోజుల్లో ఎకరాకు 350 కిలోల దిగుబడి వస్తుంది

విత్తన శుద్ధి ఇలా..

కిలో విత్తనానాకి 3 గ్రాముల మాంకోజెబ్‌తో విత్తనం శుద్ధి చేయాలి. పంట తొలిదశలో రసం పీల్చే పరుగుల బారి నుంచి కాపాడటానికి ఇమిడాక్లోప్రిడ్ 2.0 మి.లీ కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేసుకోవాలి.

ఎరువులు

ఆఖరి దుక్కిలో ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు. 16 కిలోల నత్రజని, 8 కిలోల పొటాష్, 8 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి. విత్తిన 30 రోజుల తర్వాత మరో 18 కిలోల యూరియా అందజేయాలి. 8 కిలలోల నత్రజనిని(15 నుంచి 18 కిలోల యూరియా) అదనంగా వేసుకోవాలి.

నీటి యాజమాన్యం

విత్తిన వెంటనే పలుచటి తడి ఇవ్వాలి. పూత, కాయ అభివృద్ధి, గింజ కట్టు దశలో తడులు పెట్టాలి. నువ్వులు సాగు చేసే నేలలో తేమ ఎక్కువ ఉన్న పరిస్థితుల్లో మొక్కల శాఖీయోత్పత్తి మాత్రమే జరిగి ఆకులు, కొమ్మలు ఎక్కువగా వచ్చి పూత, కాయ రాకుండా నిలిచిపోతుంది. ఈ పంట సాగు చేసేటప్పుడు ఎక్కువ మోతాదులో నీరు అందజేయకూడదు.

కలుపు నివారణ.. అంతరకృషి

పెండిమిథాలిన్ 30 శాతం ఎకరాకు 600 నుంచి 800 లీటర్ల చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజుగాని పిచికారీ చేయాలి. మొక్కలు మొలచిన 15 రోజులకు అదనపు మొక్కలను తీసివేయాలి. విత్తిన 20, 25 రోజుల ప్పుడు గొర్రుతో అంతర కృషి చేసుకోవాలి.

ఢిల్లీలో చిన్నోనిపల్లె నిర్వాసితుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న నిర్వాసిత రైతులు, టీజేఎస్ నాయకులు

గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ ఐదు గ్రామాలకు చెందిన భూ నిర్వాసిత రైతులు దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర సోమవారం ధర్నా చేపట్టారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం సమక్షంలో భూ నిర్వాసిత రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెట్టెంపాడు ఎత్తిపోతలలో భాగంగా చిన్నోనిపల్లె దగ్గర నిర్మిస్తున్న రిజర్వాయర్‌ను రద్దు చేయాలని ఏడాదిగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిర్వాసిత రైతులు ఆరోపించారు. తక్షణమే రిజర్వాయర్‌ను రద్దు చేయాలని చిన్నోనిపల్లె, చాగదోన, లింగాపురం, ఇందువాసి, బోయలగూడెం గ్రామాల భూ నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. రిజర్వాయర్‌ను రద్దు చేసి, ఇది వరకే సేకరించిన భూములను రైతులకే అప్పగించాలని జోగుళాంబ గద్వాల జిల్లా టీజేఎస్ అధ్యక్షుడు ఆలూరు ప్రకాష్‌గౌడ్, టీజేఎస్ నేతలు ఖాదర్‌పాషా, గోపాల్‌రావు డిమాండ్ చేశారు.

మైనార్టీ గురుకుల ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మైనార్టీ గురుకుల, కళాశాలల్లో 5వ, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు తేదీని ఫిబ్రవరి 15 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టైటస్‌పాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పది మైనార్టీ స్కూళ్లలో 5వ తరగతిలో మొత్తం సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన మైనార్టీ సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 10 కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఎల్‌టీ, సీఎస్ (ఒకేషనల్), ఏటీ సీజీటీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎలాంటి రుసుములు లేకుండానే ఆన్‌లైన్‌లో www.tmreis.telangana.gov.in లేదా టిమిరీస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ఆయా గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం 7331170874, 7331170828, 7331170830, 7995057894 నంబర్లను సంప్రదించాలని కోరారు.

6న రాష్ట్ర బడ్జెట్

ఫిబ్రవరి 3 నుంచే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

- 4న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ
- సభను ప్రొరోగ్ చేసి నేడు మరో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం
- రాజ్‌భవన్‌కు శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల
- గవర్నర్ తమిళిసైతో భేటీ అనంతరం తిరిగి ప్రగతిభవన్‌కు..
- శరవేగంగా పరిణామాలు

సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి 3న ప్రారంభయ్యే అసెంబ్లీ సమావేశాలను గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రసంగంతో మొదలుపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 6న ఉదయం 10.30 గంటలకు ఉభయసభల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనుండగా, 8 నుంచి బడ్జెట్‌పై చర్చ నిర్వహించనున్నారు. రాష్ట్ర బడ్జెట్ అంశంపై ప్రభుత్వం, గవర్నర్ నడుమ తలెత్తిన సందిగ్ధత హైకోర్టు వేదికగా తెరపడటంతో ప్రభుత్వం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. గవర్నర్ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలపలేదంటూ సోమవారం హైకోర్టును ఆశ్రయించిన ప్రభుత్వం కొద్ది గంటల్లోనే పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఉభయ సభలనుద్దేశించి చేసే గవర్నర్ ప్రసంగానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. దీంతో బడ్జెట్ సమావేశాల నిర్వహణకు సంబంధించి సోమవారం రాత్రి వరకు పలు పరిణామాలు వేగంగా చోటు చేసుకున్నాయి.

గవర్నర్ వద్దకు మంత్రి వేముల

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై సందిగ్ధత తొలగడంతో ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితోపాటు ఆర్థిక శాఖ అధికారులు, అసెంబ్లీ కార్యదర్శి ఈ భేటీలో పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్లో మార్పులు చేస్తూ నోటిఫికేషన్, గవర్నర్ ప్రసంగంలో ఉండాల్సిన అంశాలు, గవర్నర్ వద్ద పెండింగులో బిల్లులు తదితరాల గురించి చర్చించినట్లు సమాచారం. గవర్నర్ ప్రసంగంలో ఉండాల్సిన అంశాలపైనా కసరత్తు జరిగినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు సాయంత్రం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ తమిళిసైతో భేటీ అయ్యారు. ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించాల్సిందిగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను వేముల ప్రశాంత్‌రెడ్డి ఆహ్వానించారు. బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సమ్మతి తెలపడంతోపాటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు గవర్నర్ అంగీకరించినట్లు తెలిసింది. గవర్నర్ ప్రసంగంలో ఉండే అంశాలపైనా సూచనప్రాయంగా గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. అనంతరం వేముల ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌కు ఈ వివరాలు చెప్పినట్లు తెలిసింది.

ప్రొరోగ్ చేసి మరో నోటిఫికేషన్?

ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 12.10 గంటలకు శాసనసభ, శాసన మండలి వేర్వేరుగా సమావేశమవుతాయని ఈ నెల 21న అసెంబ్లీ కార్యదర్శి నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ ప్రసంగం లేకుండానే అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని భావించగా, 3న ఉభయ సభల్లో బడ్జెట్ ప్రవేశపెడతారనే సంకేతాలు వెలువడ్డాయి. తాజా పరిణామాలతో అసెంబ్లీ నిర్వహణ షెడ్యూల్లో కొన్ని మార్పులు జరగనున్నాయి. 2021 సెప్టెంబర్ నుంచి అసెంబీ ప్రొరోగ్ కాకుండానే సమావేశమవుతూ వస్తోంది. ప్రస్తుతం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనుండటంతో వెంటనే అసెంబ్లీని ప్రొరోగ్ చేసి మరో నోటిఫికేషన్‌ను శాసనసభ కార్యదర్శి ఇచ్చే అవకాశముంది. మంగళవారం సాయంత్రంలోగా నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. కాగా, 4వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ, ముఖ్యమంత్రి సమాధానం ఉంటాయి.

తెర్రెం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న మహిళా మావోయిస్టు అరెస్టు

చర్ల: తెర్రెంలో 2021లో జరిగిన అతిపెద్ద ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న ఒక మహిళా మావోయిస్టును ఆదివారం రాత్రి రాయ్‌పూర్‌కు చెందిన ఎన్‌ఐఏ అధికారులు అరెస్టు చేశారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఒకటో ప్లాటూన్ సెక్షన్ కమాండర్ మడవి హిడ్మా నేతృత్వాన 2021 ఏప్రిల్ 4న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధి టేకులగూడెం–జొన్నగూడ అటవీ ప్రాంతాల్లో మాటు వేసిన మావోయిస్టులు పక్కా పథకం ప్రకారం పోలీసు బలగాలను రప్పించి మందుపాతరలను పేల్చడంతో పాటు రాకెట్ లాంఛర్లతో దాడి చేశారు. ఈ ఘటనలో 22 మంది జవాన్లు మృతిచెందగా, 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే, కోబ్రా విభాగం జవాన్ ఒకరిని మావోయిస్టులు పట్టుకెళ్లి ఐదు రోజుల తరువాత విడిచిపెట్టారు. ఈ ఘటన అప్పట్లో ఇరు రాష్ట్రాల పోలీసు యంత్రాంగాన్ని ఆందోళనకు గురి చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న మావోయిస్టుల్లో పలువురిని గతంలోనే అరెస్టు చేయగా, తాజాగా ఆదివారం రాత్రి బీజాపూర్ జిల్లాలోని భూపాలపట్నం సమీపాన మహిళా మావోయిస్టు మడకం ఉంగిని అరెస్టు చేశారు. ఉంగి స్వగ్రామం బీజాపూర్ జిల్లా ఉడతమల్ల కాగా, ఈమె పదేళ్లుగా మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నట్లు తెలిసింది. ఉంగిని ఎన్‌ఐఏ అధికారులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

విషమంగానే తారకరత్న ఆరోగ్యం

ఎక్మో కాదు.. వెంటిలేటర్‌తో చికిత్స



బనశంకరి: నాలుగు రోజుల కిందట గుండెపోటుకు గురై బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలుగు నటుడు నందమూరి తారకరత్న పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆయన ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్లు సోమవారం సాయంత్రం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో వైద్యులు పేర్కొన్నారు. తారకరత్నకు ఎక్మో సపోర్ట్ ఇవ్వలేదని, అత్యాధునిక వైద్యపరికరాలతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. సోమవారం నిర్వహించిన వైద్యపరీక్షలపై వివరాలు వెల్లడించలేదు. ఆస్పత్రి వద్దకు అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో పోలీసులు పటిష్ట భద్రత కల్పించారు. నిమ్హాన్స్ న్యూరోసర్జన్ డాక్టర్ గిరీశ్ కులకర్ణి నేతృత్వంలో ఇద్దరు న్యూరోసర్జన్లు, నారాయణ హృదయాలయకు చెందిన ఎనిమిదిమందికిపైగా వైద్యనిపుణులు తారకరత్నకు చికిత్స చేస్తున్నారు.

భూపాలపల్లిలో 'డబుల్' పోరాటం

ఇళ్లను ఆక్రమించేందుకు నిరుపేదలతో కలిసి వెళ్లిన రిటైర్డ్ కలెక్టర్ మురళి



పోలీస్‌స్టేషన్‌లో మహిళలతో బైఠాయించిన ఆకునూరి మురళి

భూపాలపల్లి: డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇంకా పంపిణీ చేయడంలేదంటూ నిరుపేదలు ఆక్రమణ బాటపట్టారు. రిటైర్డ్ కలెక్టర్ ఆకునూరి మురళి నాయకత్వంలో ఇళ్లను ఆక్రమించేందుకు యత్నించగా పోలీసులు అడ్డు కొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లిలో సోమవారం జరిగింది. అప్పటి ఎమ్మెల్యే ఎస్.మధుసూదనాచారి, అప్పటి కలెక్టర్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో 2017–18లో 544 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. 2020లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మరో 420 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించగా అవి కూడా చివరిదశకు చేరాయి. ఇళ్లను కేటాయించాలని మహిళలు డిసెంబర్ 28 నుంచి వారంపాటు నిరాహారదీక్ష చేపట్టారు. పోలీసులు దాడి చేసి దీక్షాశిబిరాన్ని తొలగించడంతో ఈ నెల 6న ఆకునూరి మురళిని మహిళలు కలిసి మద్దతు కోరారు. అదేరోజున కలెక్టర్ భవేష్‌మిశ్రాకు వినతిపత్రం అందజేయగా నెలలోపు ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ గడువు ముగిసినా ఇళ్లను కేటాయించక పోవడంతో ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్‌లోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు మురళితోపాటు 100 మంది మహిళలు బైఠాయించారు. తహసీల్దార్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. ఫిబ్రవరి 4న ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థను దెబ్బతీసేందుకు కేంద్రం కుట్ర

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపణ



మహాధర్నాలో అభివాదం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ: కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్‌టీవో జీఓ–3ను రద్దు చేసే వరకు ఢిల్లీ కేంద్రంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ట్రాయ్ అసంబద్ధ విధానాలను వ్యతిరేకిస్తూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కేబుల్ ఆపరేటర్ల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య హాజరై సంఘీభావం తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులుగా చేసిన చరిత్ర కేబుల్ ఆపరేటర్ వ్యవస్థదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు అప్పగిస్తోందని ఆరోపించారు. కేబుల్ ఆపరేటర్ల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా కేబుల్ ఆపరేటర్లకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కేబుల్ ఆపరేటర్లపై ట్రాయ్ పెత్తనాన్ని అధిగమించేందుకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కేబుల్ ఆపరేటర్లు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జేఏసీ కన్వీనర్ పమ్మి సురేష్, ప్రధాన కార్యదర్శి కిశోర్‌లతో పాటు సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు ఎలా ఉంది?

- న్యూఢిల్లీ డిఫెన్స్ కళాశాల అధికారుల ప్రత్యక్ష పరిశీలన
- సిద్దిపేట జిల్లాలో పర్యటించిన బృందం



గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న డిఫెన్స్ కళాశాల అధికారులు

గజ్వేల్: తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి తీరును పరిశీలించేందుకు న్యూఢిల్లీకి చెందిన డిఫెన్స్ కళాశాల అధికారుల బృందం 'నేషనల్ సెక్యూరిటీ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్' పేరిట చేపట్టిన ఐదు రోజుల అధ్యయన యాత్ర సోమవారం సిద్దిపేట జిల్లాలో ప్రారంభమైంది. కళాశాలకు చెందిన ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ ప్రియాంక్ భర్తీతోపాటు 18మంది అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు కూడా బృందంలో ఉన్నారు. ముందుగా సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌కు వారు చేరుకున్నారు. వారికి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి 'మిషన్ భగీరథ'పథకం అమలు తీరుతెన్నులను కలెక్టర్‌తోపాటు ఈ పథకం ఈఈ రాజయ్యలు వివరించారు. నీటిలో ఫ్లోరైడ్ కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు అంగవైకల్యంలో నానా ఇక్కట్లు పడేవారని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని వారికి వివరించారు. ఆ తర్వాత హరితహారం కార్యక్రమం ద్వారా జిల్లాలో వచ్చిన ఫలితాలను, కంటివెలుగు పథకం తీరుతెన్నులను కలెక్టర్, జిల్లా అటవీశాఖాధికారి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ బృందం సభ్యులకు వివరించారు.

ప్రత్యక్ష పరిశీలనలతో బిజీబిజీ

పథకాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకున్నాక డిఫెన్స్ కళాశాల అధికారులు కేజీ టూ పీజీ విద్యను అందిస్తున్న గజ్వేల్‌లోని ఎడ్యుకేషన్ హబ్, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, మల్లన్నసాగర్ సందర్శనలతో బిజీబిజీగా గడిపారు. ఐదురోజులపాటు జరగనున్న ప్రత్యక్ష పరిశీలన, అధ్యయనం వివరాలను కేంద్రానికి నివేదిక రూపంలో అందజేస్తామని డిఫెన్స్ కళాశాల అధికారులు తెలిపారు. కార్యక్రమంలో 'గడా' (గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ షోరూంలో రైతు ఆత్మహత్యాయత్నం

కామారెడ్డి క్రైం: రైతు వద్ద నుంచి సెకండ్ సేల్ కింద కొన్న ట్రాక్టర్‌కు సంబంధించిన డబ్బులు ట్రాక్టర్ షోరూం మేనేజర్ ఇవ్వకపోవడంతో బాధితుడు షోరూంలోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితుడు, అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన అంగోత్ ప్రకాశ్ ఏడాది క్రితం జిల్లా కేంద్రంలోని స్వరాజ్ షోరూంలో తన ట్రాక్టర్‌ను సెకండ్ సేల్ కింద విక్రయించాడు. షోరూం మేనేజర్ ట్రాక్టర్‌కు 3.50 లక్షలకు ధర నిర్ణయించి అడ్వాన్సుగా రూ. 50 వేలు ఇచ్చారు. మిగతా డబ్బులు ఇవ్వకుండా ఏడాది నుంచి రేపుమాపు అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అయితే సోమవారం షోరూంకు వెళ్లిన ప్రకాశ్ మేనేజర్‌తో మాట్లాడినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దాంతో భయాందోళనకు గురైన షోరూం సిబ్బంది పోలీసులకు సమాచారమివ్వగా ప్రకాశ్‌ను జిల్లా ఆస్పత్రికి తరలించారు. జిల్లా అదనపు సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆస్పత్రికి వచ్చి బాధితుని స్టేట్మెంట్ తీసుకున్నారు. బాధితునికి 40 శాతం గాయాలయ్యాయని, మెరుగైన చికిత్స కోసం గాంధీ లేదా ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. తమకు న్యాయం చేయాలని బాధితుని కుటుంబ సభ్యులు వేడుకున్నారు. ఘటన అనంతరం షోరూంకు నిర్వాహకులు తాళం వేశారు. ఫోన్లో సంప్రదించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

నేషనల్ వాలీబాల్ పోటీలకు క్రీడాకారులు



యశ్వంత్ కుమార్



శివరాజ్

మహబూబ్‌నగర్ క్రీడలు: అసోం రాష్ట్రం గౌహవాటిలో వచ్చేనెల 2వ తేదీ నుంచి 9 వరకు జరిగే 71వ సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు యశ్వంత్ కుమార్, శివరాజ్ ఎంపికయ్యారు. యశ్వంత్‌కుమార్ పలుసార్లు అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. అదేవిధంగా సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషుల జట్టుకు జిల్లా కేంద్రానికి చెందిన బషీరుద్దీన్ కోచ్‌గా వ్యవహరించనున్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



బాలానగర్: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని యోగా గురువు కృష్ణ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. యోగాపై అవగాహన, పర్యావరణ సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. అక్టోబర్ 16న మైసూర్‌లో ప్రారంభమైన పాదయాత్ర కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఏపీ రాష్ట్రాల మీదుగా తెలంగాణలో సాగుతుందని తెలిపారు. ఇప్పటికే 2,500కి.మీ. పూర్తి చేసుకున్నానని తెలిపారు. 200 రోజుల పాటు 28 రాష్ట్రాలలో రోజుకు 25 నుంచి 30 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుందన్నారు. మధ్యలో విద్యార్థులకు యోగాసాధన, మొక్కలు నాటడం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ చేరిన అనంతరం ప్రధాని మోడీని కలిసి విన్నవిస్తానని చెప్పారు. మొక్కల పెంపకంతో ఆధునికయుగంలో పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా ఉంటుందని రుతువుల సమయపాలన ఉంటుందని అన్నారు. మండల కేంద్రానికి చేరుకున్న పాదయాత్రకు యోగా గురువులు శేఖర్‌గౌడ్, వేణుపటేల్, కుమార్‌చారి, ఆంజనేయులు, సాయి తదితరులు స్వాగతం పలికారు.

ముగిసిన లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు



కోనేటిలో భక్తులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజున ఆలయ పండితులు చక్రతీర్థం జరిపించటంతో ఉత్సవాలు ముగించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛరణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో నిత్య హోమం జరిపించి మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ధ్వజారోహణం, చక్రతీర్థ సేవ చేశారు. ద్వాదశారాధనలు, శ్రీపుష్పయాగం, నాగబలి, దేవతోద్వాసన, సప్తవర్ణ సేవలు నిర్వహించారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ..

ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తుల రద్దీ కొనసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు సహకరించిన ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ప్రజలకు ఈఓ శ్రీనివాసరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మరో రెండు రోజుల పాటు భక్తుల రద్దీ కొనసాగనుంది.



చక్రతీర్థం నిర్వహిస్తున్న పురోహితులు



హోమం చేస్తున్న పురోహితులు, అభివృద్ధి కమిటీ సభ్యులు



తినుబండారాల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

నేటి నుంచి మన్యంకొండ ఉత్సవాలు

- అళహరి వంశీయుల ఇంటి నుంచి గుట్టెక్కనున్న స్వామివారు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తల స్వగ్రామమైన కోటకదిర నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా కొండపైకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని శోభయాత్రతో ఆలయం వద్దకు తీసుకొచ్చి ఫిబ్రవరి 7వ తేదీ వరకు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రధాన ఘట్టమైన గరుఢ వాహనసేవ, రథోత్సవం మాఘశుద్ధ పౌర్ణమి రోజు అయిన 5వ తేదీన ఉంటుంది. మొదటి రోజు మంగళవారం తిరుచ్చిసేవ, ఫిబ్రవరి 1న హంసవాహనసేవ, 2న గజవాహనసేవ, 3న సూర్యప్రభ సేవ, 4న ప్రభోత్సవం, 5న గరుఢవాహనసేవ, రథోత్సవం, 6న అశ్వవాహనసేవ ద్వితీయ ప్రభోత్సవం, 7న స్వామివారి దర్బారు సేవ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ తెలిపారు.

మన్యంకొండ వీడియో సాంగ్‌ను విడుదల చేసిన మంత్రి

తీరితే తిరుపతి లేకుంటే మన్యంకొండ అని వేంకటేశ్వరుని భక్తులు భావిస్తారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రీవ్యూ థియేటర్‌లో తెలంగాణ తిరుపతి మన్యంకొండ పేరిట తయారు చేసిన వీడియో సాంగ్‌ను మంత్రి విడుదల చేశారు. దీన్ని రూపొందించిన దర్శకుడు బాలాజి దూసరి, రచయిత అభి ఉప్పలను ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ పర్యాటక హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రజలకే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మన్యంకొండ దేవాలయం ప్రాశస్త్యం తెలియచేయడం ముఖ్య ఉద్దేశంగా ఈ పాటను చిత్రీకరించారని తెలిపారు. లక్షలాదిగా భక్తులు తరలివచ్చే మన్యంకొండ క్షేత్రంలో ఇటీవలే డబుల్ రోడ్డు నిర్మాణం, భక్తుల విశ్రాంతి కోసం గదులు, షెడ్లు నిర్మించామని తెలిపారు. సుమారు రూ. 100 కోట్ల వ్యయంతో రోప్ వే, బడ్జెట్ హోటల్, ఇతర అభివృద్ధి పనులు చేపట్టి అద్భుతంగా దేవాలయాన్ని తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. ఆర్థిక స్థోమత లేని భక్తులు మన్యంకొండకు వచ్చి దర్శించుకుంటే తిరుపతికి వెళ్లినంత పుణ్యమని తెలిపారు. సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి రాజేష్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, నారాయణగౌడ్, జనార్దన్ పాల్గొన్నారు.

పాలెం వెంకన్నకు సేవలు పరిసమాప్తం



పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు 23వ తేదీ నుంచి ప్రారంభమై సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమాలలో ప్రధానంగా చక్రస్నానం, పుష్పయాగం, శేషవాహన సేవలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్యారాధన, హోమం, నివేధన నిర్వహించగ, రాత్రి దేవతా విసర్జన, ద్వాదశరాధనలు, మూకబలి వంటి కార్యక్రమాలు చేపట్టారు. చివరగా స్వామి వారి పవళింపు సేవతో ఉత్సవాలకు పరిసమాప్తి చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో 'పాలమూరు' ప్రతిభ

- 30 పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు



పతకాలు సాధించిన జిల్లా తైక్వాండో క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో ఈనెల 28, 29 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు జిల్లా తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో 56మంది క్రీడాకారులు పాల్గొనగా వీరిలో 5 మంది బంగారు, 9 రజతం, 16 మంది కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. టీమ్‌కు మేనేజర్‌గా శంకర్, కోచ్‌గా రాజేష్ వ్యవహరించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షులు దేవిదాస్, కార్యదర్శి సురేందర్‌బాబు, ఉపాధ్యక్షులు జి.సాయిలు, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, కోచ్‌లు అభినందించారు. తైక్వాండోలో జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో మరో వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో ఆయిల్‌పాం తోటల పెంపకంపై ఉద్యాన శాఖ అధికారులు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 3,000 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచేందుకు లక్ష్యం నిర్దేశించగా.. ఇప్పటి వరకు సుమారు 1,676 ఎకరాల్లో మొక్కలు నాటడం పూర్తి చేశారన్నారు. 2038 ఎకరాలకు డ్రిప్‌కు రైతులు డీడీలు చెల్లించారని, 2,318 ఎకరాల్లో మొక్కలకు రైతుల వాటా చెల్లించడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 15 నాటికి రైతులు డ్రిప్ అలాగే మొక్కలకు సంబంధించిన వారి వాటా డీడీలను పూర్తిస్థాయిలో కట్టి మార్చి 15 నాటికి మొత్తం ప్రక్రియను పూర్తిచేసేలా వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న 3,000 ఎకరాల లక్ష్యానికి మించి మరో 1,000 ఎకరాలు అదనంగా ఆయిల్‌పాం తోటలు పెంచేందుకు సిద్ధంగా ఉన్న రైతులను గుర్తించాలన్నారు. ఆ రైతులను చైతన్యం చేసి, దానికి తగ్గట్టుగా తోటలు పెంచేందుకు ఏర్పాటు చేయాలని, ప్రి యూనిక్ ఇండియా లిమిటెడ్ కంపెనీ, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీలను ఆదేశించారు.

శ్రీరామకొండ దేవాలయ నిర్మాణ స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోయిల్‌కొండ: మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీరామకొండ క్షేత్రానికి రూ.10కోట్ల సీఎం ప్రత్యేక నిధులు మంజూరు కావడంతో సోమవారం ఆలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం ఆలయ నిర్మాణాల కోసం స్థలాన్ని పరిశీలించారు. శ్రీరామకొండపై అత్యంత వైభవంగా నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మోదీపూర్ రవి, రాజవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

గిరిజనుల రిజర్వేషన్ పెంపునకు పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్ జాదవ్

జడ్చర్ల టౌన్: దామాషా పద్ధతిన గిరిజనుల రిజర్వేషన్ పెంపు సాధించుకుందామని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్‌కుమార్ జాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని పీఆర్‌టీయూ భవనంలో సోమవారం నిర్వహించిన మండల లంబాడీల ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను 10శాతానికి పెంచాలని ఎప్పటి నుంచో నినదిస్తున్నా ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రిజర్వేషన్ సాధనతో పాటు గ్వార్ బోలిని రాష్ట్ర భాషగా గుర్తించాలని, సేవాలాల్ మహరాజ్ జయంతి, తీజ్ లాంటి గోర్ ధర్మానికి చెందిన పండగలను రాష్ట్ర జాబితాలో చేర్పించి సెలవు దినాలుగా ప్రకటించాలని పోరాడుదామన్నారు. అనంతరం లంబాడీల ఐక్యవేదిక మండల సమన్వయకర్తగా నారాయణ మేఘావత్, ఇన్‌చార్జ్‌గా నందునాయక్, కార్యదర్శిగా హనుమంతునాయక్, సంయుక్త కార్యదరిశగా దేవ్‌సింగ్‌నాయక్‌లను ఎన్నుకున్నారు. జిల్లా సమన్వయకర్త శంకర్‌నాయక్, రమేష్ నాయక్, వీరస్వామి పాల్గొన్నారు.